


పంచాయతీల రికార్డులను స్వాధీనం చేసుకుంటున్న అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి మెదక్ 5

బుధవారం 11 సెప్టెంబరు 2024

జిల్లాల వార్తలు

11 గ్రామాల్లో నేటి నుంచి మున్సిపల్ పాలన

● రికార్డులు అందజేసిన పంచాయతీ కార్యదర్శులు ● మున్సిపాలిటీల్లో ప్రత్యేక సమావేశాలు

పటాన్‌చెరు, సెప్టెంబరు 10: పటాన్‌చెరు, అమీన్‌పూర్ మండలాల పరిధిలోని 11 గ్రామ పంచాయతీల్లో మంగళవారం నుంచి మున్సిపల్ పాలన ప్రారంభమైంది. పటాన్‌చెరు నియోజకవర్గంలో ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలో ఉన్న గ్రామ పంచాయతీలను సమీప మున్సిపాలిటీలలో విలీనం చేస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. పటాన్‌చెరు మండల పరిధిలోని పాటి, కర్ధనూర్, ఘనాపూర్, ముత్తంగి, పోచారం గ్రామ పంచాయతీలను తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోకి తీసుకువచ్చారు. అమీన్‌పూర్ మండల పరిధిలోని ఐలాపూర్, ఐలాపూర్‌తండా, కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ, సుల్తాన్‌పూర్, దాయర పంచాయతీలను తెల్లాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు అమీన్‌పూర్, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్లు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. పంచాయతీ కార్యాలయాలపై బోర్డులను మార్చి మున్సిపాలిటీలుగా మార్చాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఇకపై ఆయా పంచాయతీ కార్యాలయాలు వార్డు కార్యాలయాలుగా కొనసాగేలా మున్సిపల్ కమిషనర్లు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో పౌరసేవలపై అవగాహన కల్పించనున్నారు. భవన నిర్మాణ అనుమతులు, ఇంటిపన్ను తదితర అంశాలపై గందరగోళం లేకుండా ప్రజల సందేహాలను నివృత్తి చేస్తామని అమీన్‌పూర్ కమిషనర్ జ్యోతిరెడ్డి తెలిపారు.

ఆ రెండు పంచాయతీలపై సందిగ్ధత

అమీన్‌పూర్ మండల పరిధిలో రింగ్‌రోడ్డుకు అవతల ఉన్న గ్రామ పంచాయతీలు వడక్‌పల్లి, జానకంపేట గ్రామాలను ఎందులో విలీనం చేస్తారన్న దానిపై స్పష్టత కరువైంది. కేవలం రెండు గ్రామాలతో మండలం కొనసాగితే ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు ఉంటాయా అన్నదానిపై సందేహాలు నెలకొన్నాయి. ఇక పటాన్‌చెరు మండల పరిధిలో రుద్రారం, చిట్కుల్, నందిగామ, భానూర్, క్యాసారం, పాషమైలారం, ఇస్నాపూర్, పెద్దకంజర్ల, చిన్నకంజర్ల, ఇంద్రేశం, ఐనోల్, రామేశ్వరంబండ, బచ్చుగూడెం పంచాయతీలుగా కొనసాగనున్నాయి. ఇస్నాపూర్ కేంద్రంగా అన్ని గ్రామాలను మున్సిపాలిటీగా, అమీన్‌పూర్ మండలంలో మిగిలిన రెండు గ్రామాలను పక్కనే ఉన్న బొల్లారం మున్సిపాలిటీలో విలీనం చేయాలని కొందరు నాయకులు, ప్రజాప్రతినిధులు సూచిస్తున్నట్లు తెలిసింది.

సంగారెడ్డి రోడ్లకు మహర్దశ

సమీక్షించిన మంత్రి దామోదర, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

నేషనల్ హైవేను కలిపేలా 80ఫీట్ల రహదారులు

నాలుగు రోడ్లకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశం

సంగారెడ్డి, సెప్టెంబరు 10: సంగారెడ్డి పట్టణంలోని రహదారులకు మహర్దశ పట్టనున్నది. ట్రాఫిక్ సమస్యతోపాటు ఇరుకుగా ఉన్న పలు రోడ్లను 80ఫీట్ల విస్తీర్ణంలో విస్తరించడానికి చర్యలు చేపట్టారు. తాజాగా కలెక్టరేట్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డితో కలిసి మంత్రి దామోదర రాజనర్సింహ రహదారుల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఇందులో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌తోపాటు మున్సిపల్, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు. పంచాయతీరాజ్ పరిధిలో ఉన్న రోడ్లను ఆర్‌అండ్‌బీకి వెంటనే బదిలీ చేయాలని సూచించారు. కొత్తగా నిర్మించే రహదారులకు ప్రతిపాదనలు సిద్ధంచేసి పంపిస్తే నిధులు మంజూరు చేయిస్తామని వారు స్పష్టం చేశారు.



సంగారెడ్డిలోని రహదారుల అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి



సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, అధికారులు

ఈ రహదారుల అభివృద్ధి

- ● సంగారెడ్డి ఐటీఐ పక్క నుంచి గొల్లగూడెం, కంది, ఎల్ఎంఎల్ ఫంక్షన్‌హాల్, చిమ్నాపూర్ రోడ్ మీదుగా ఐఐటీ వద్ద జాతీయ రహదారి వరకు 80 ఫీట్ల రహదారి.
- ● నటరాజ్ థియేటర్ నుంచి కల్పకుంట, చిమ్నాపూర్ రోడ్ మీదుగా ఐఐటీ వద్ద నేషనల్ హైవే వరకు 80 ఫీట్ల రోడ్డు.
- ● కొత్త బస్టాండ్ ఎదురుగా రుక్మిణీ థియేటర్ నుంచి రాజంపేట, అంతాయిపల్లి మీదుగా నేషనల్ హైవే వరకు 80 ఫీట్ల రహదారి.
- ● జాయింట్ కలెక్టర్ క్యాంపు ఆఫీస్ నుంచి ఎఫ్ఆర్ఎస్, ఫతేఖాన్ దర్గా, రాజంపేట, వడ్డెరకాలనీ, రాంచంద్రనగర్ కాలనీ, మల్కాపూర్ చౌరస్తా జంక్షన్ మీదుగా జాతీయ రహదారిని కలుపుతూ 80ఫీట్ల రోడ్డు.

కాలుష్యం 'డంపు'..

పొలాలు ముంపు



- ● ఫసల్‌వాది డంపుయార్డుకు లీకేజీ
- ● పచ్చని పొలాలు కంపు.. కంపు..
- ● మురికి నీటి ముంపులో 150 ఎకరాలు
- ● పెద్దచెరువును తాకిన దుర్గంధం
- ● ఫిర్యాదులు పట్టని సంగారెడ్డి మున్సిపాలిటీ
- ● కలెక్టర్ దృష్టిపెట్టాలని రైతుల విన్నపం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, సెప్టెంబరు 10: ఈ సమస్య లక్షణ్ ఒక్కడిదే కాదు. ఫసల్‌వాది గ్రామ పెద్దచెరువు ఆయకట్టు పరిధిలోని రైతులందరిదీ. చేతికొచ్చే సమయంలో పచ్చని పొలాలను మురుగునీరు ముంచెత్తుతున్న నేపథ్యంలో రైతుల శ్రమంతా వృథాగా మారింది. దీంతో, వారు కన్నీరుమున్నీరవుతున్నారు.

అధ్వాన్నంగా డంపుయార్డు

ఫసల్‌వాదిలో ఏర్పాటుచేసిన సంగారెడ్డి మున్సిపాలిటీకి సంబంధించిన డంపుయార్డు అధ్వాన్నంగా తయారైంది. దాదాపు ఐదెకరాల్లో చుట్టూ రేకులషెడ్లు అమర్చి మధ్యలో చెత్తాచెదారం కుప్పలుగా వేస్తున్నారు. తడిపొడి అనే తేడాలేకుండా చెత్తంతా ఒకేచోట డంప్ చేస్తున్నారు. ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ డంపుయార్డులో అప్పటి నుంచి చెత్తకుప్పలను నిల్వచేస్తున్నారంటే అతిశయోక్తి కాదు. చెత్తమీదనే చెత్త వేస్తూ కొండలను తలపించేలా కుప్పలు కనిపిస్తున్నాయి. ఈ చెత్తకుప్పలపైనే కుక్కలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. డంపుయార్డంతా బురదమయంగా మారింది. నిత్యం కురుస్తున్న వర్షాలతో చెత్తాచెదారం నుంచి వెలువడే మురుగు లీచెట్ బయటకు పారుతున్నది. డంపుయార్డు నుంచి వస్తున్న మురుగునీరంతా ఫసల్‌వాది పెద్దచెరువుకు వచ్చే కాలువలో కలుస్తున్నది. ఈ కాలువ గుండా ప్రవహిస్తూ పొలాలను ముంచెత్తుతున్నది. స్వచ్ఛమైన పెద్దచెరువులో మురుగు చేరుతున్నది. దీంతో, పశువులు, చేపలకు ముప్పు నెలకొన్నది. ముక్కుపుటలదిరే దుర్గంధం ప్రభావానికి రైతులు పొలాలకు జంకుతున్నారు.

పట్టించుకోని మున్సిపాలిటీ

పొలాలను మురుగునీరు ముంచెత్తుతున్న విషయాన్ని సంగారెడ్డి మున్సిపాలిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. డంపుయార్డు నుంచి మురుగునీరు లీకేజీ కాకుండా చూడాలని పదేపదే కోరినా ఫలితం లేదని ఆవేదన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని పలు మున్సిపాలిటీలు చెత్త సేకరణ విషయంలో ఆదర్శంగా నిలుస్తున్నాయి. తడి, పొడి, హానికారక చెత్తను వేర్వేరుగా సేకరిస్తూ శుద్ధి చేస్తున్నారు. కానీ ఇక్కడ అన్నిరకాల చెత్తలను ఒక్కచోటే నిల్వచేస్తూ కంపు లేపుతున్నారు.



నాశనమైన వరిపంటను చూపిస్తున్న రైతు



ఫసల్‌వాదిలోని డంపుయార్డులో కుప్పలుతెప్పలుగా చెత్తాచెదారం

కలెక్టర్ పట్టించుకోవాలి



సొంత భూమి లేకపోవడంతో 15 ఎకరాలను కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నా. రూ. లక్షలు పెట్టుబడిపెట్టి వరి నాట్లు వేశారు. పంట పొట్ట దశలో ఉంది. సంగారెడ్డి మున్సిపాలిటీ డంపుయార్డు కారణంగా పచ్చని పొలమంతా మురుగునీటితో నిండిపోయింది. మున్సిపాలిటీ అధికారులతో మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదు. కలెక్టర్ మేడమ్ మా బాధను అర్థంచేసుకుని చర్యలు తీసుకోవాలి.

-వేణుగోపాల్‌రెడ్డి, రైతు, ఫసల్‌వాది

పొలంలోకి దిగితే రోగాలు సోకుతున్నాయి



ఎకరన్నర పొలాన్ని మురుగు ముంచెత్తడంతో పంట సర్వనాశనమైంది. పొలంలోకి దిగితే ఎలర్జీలు, రోగాలు సోకుతున్నాయి. వెయ్యి రూపాయలు ఇస్తామన్నా కూలీలు పనికి రావడం లేదు. డంపుయార్డు నిర్వహణ సరిగ్గా లేక మురుగునీరు పొలాల్లోకి ప్రవహిస్తున్నది. ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు. పరిస్థితి ఇలాగే ఉంటే పొలాలు బీడువారుతాయి.

-రాము, రైతు, ఫసల్‌వాది



పట్టుబడిన ఎండు గంజాయి, నిందితులను చూపుతున్న పోలీసులు

పట్టుబడిన 'పుష్ప' బ్యాచ్

పికప్‌వ్యాన్ ట్రాలీ అడుగున ప్రత్యేక అరలో గంజాయి

ఒడిశా నుంచి కర్ణాటకకు తరలిస్తుండగా చిరాగ్‌పల్లి వద్ద తనిఖీల్లో గుర్తింపు

140 కిలోల గంజాయి పట్టివేత, పికప్‌వ్యాన్ స్వాధీనం, ఇద్దరి అరెస్టు

7

ఎడారి దేశంలో అనామక చావు

దుబాయ్‌లో మెదక్ జిల్లా వ్యక్తి మృతి

ఉపాధి కోసం నెల రోజుల క్రితం వలస

అనారోగ్యానికి గురయ్యాడని ఏజెంట్ ఫోన్

మృతదేహాన్ని రప్పించాలని కుటుంబ సభ్యుల వేడుకోలు

7



వసురామ్ (ఫైల్)

అల్లాదుర్గం-మెటల్‌కుంట రోడ్డుకు మోక్షం

అధ్వానంగా మారిన అంతర్రాష్ట్ర రహదారిపై 'ఆంధ్రజ్యోతి' కథనం

స్పందించిన కేంద్ర ఉపరితల రవాణా శాఖ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

జోగిపేట, సెప్టెంబరు 10: అల్లాదుర్గం-మెటల్ కుంట రోడ్డుకు మోక్షం లభించనున్నది. అందోలు నియోజకవర్గ పరిధిలోని అల్లాదుర్గం మండల కేంద్రంలోని ఐబీ చౌరస్తా నుంచి న్యాల్‌కల్ మండలంలోని మెటల్‌కుంట వరకు ఉన్న 55 కి.మీల పరిధిలోని అంతర్‌రాష్ట్ర రహదారి అధ్వానంగా మారింది. ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారిన తీరుపై ఈ నెల 7న 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'నరక దారులు' పేరిట కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ వార్తా కథనాన్ని జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగా జోగినాథ్‌గుప్తా ఢిల్లీలోని పీఎంవో తోపాటు, కేంద్ర ఉపరితల రవాణాశాఖా మంత్రి నితిన్‌గడ్కరీ కార్యాలయానికి పంపించారు. ఈ రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించి పునర్నిర్మించాలని విన్నవించారు. దీనికి స్పందించిన పీఎం కార్యాలయ అధికారులు సోమవారం తనకు ఫోన్ చేసి వివరాలు తీసుకున్నట్లు జోగినాథ్ గుప్తా మంగళవారం తెలిపారు. రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించి పునర్నిర్మించడానికి అవసరమైన రిపోర్ట్‌ను తయారుచేసి పంపించమని కేంద్ర ఉపరితల రవాణాశాఖ రీజయనల్ ఆఫీసర్ క్రిష్ణప్రసాద్.. రాష్ట్రంలోని నేషనల్ హైవే ఈఎన్‌సీకి లేఖ రాశారని గంగా తెలిపారు.

మెదక్‌లో మెడికల్ కాలేజీకి

ఎన్‌ఎంసీ గ్రీన్‌సిగ్నల్

● 50 సీట్లతో ప్రారంభించేందుకు అనుమతి ● నోటిఫికేషన్ రాగానే కౌన్సెలింగ్ కోసం ఏర్పాట్లు

మెదక్ అర్బన్/మెదక్ కల్చరల్, సెప్టెంబరు 10: మెదక్ వైద్య కళాశాలకు ఎన్‌ఎంసీ (నేషనల్ మెడికల్ కౌన్సిల్) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీని ఈ ఏడాది 50 సీట్లతో ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేసి అనుమతుల కోసం దరఖాస్తు చేశారు. ఈమేరకు జూన్ 24న జాతీయ వైద్యమండలి తనిఖీలు చేపట్టి, సరైన సౌకర్యాలు లేవని అనుమతి నిరాకరించింది. దీంతో, కలెక్టర్ రాహుల్‌రాజ్ పర్యవేక్షణలో అధికారులు నిబంధనల మేరకు సౌకర్యాలను అభివృద్ధి చేసేందుకు కృషిచేశారు. ఎట్టకేలకు అనుమతులు రావడంతో స్టేట్ కౌన్సెలింగ్ ద్వారా విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

సీహెచ్‌సీ నుంచి మెడికల్ కళాశాల వరకు..

మెదక్ పట్టణంలోని న్యూమార్కెట్‌లో నిజాం కాలంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ని 30 పడకలతో ప్రారంభించారు. పెరిగిన ఓపీని దృష్టిలో పెట్టుకొని సీహెచ్‌సీని 1997లో జంబికుంటకు మర్చారు. 1999లో 50 పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. 2016లో కొత్త జిల్లా ఏర్పాటు అనంతరం 100 పడకల జిల్లా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. జిల్లా ఆసుపత్రిలో ఏటా 3 వేలకు పైగా ప్రసవాలు నమోదయ్యాయి. కానీ, సరైన వసతి సౌకర్యాలు లేక గర్భిణులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుండడంతో 2018లో పట్టణ పరిధిలోని పిల్లికొట్టాల్ శివారులో 5 ఎకరాల స్థలంలో.. రూ.17 కోట్ల నిధులతో 100 పడకల సామర్థ్యంతో అత్యాధునిక వసతులతో మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని నిర్మించారు.

దశాబ్దాల కల.. మెడికల్ కళాశాల

మెదక్‌లో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని ప్రజలు దశాబ్దాలుగా ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు. వారి ఆకాంక్షలను గుర్తించి గత ప్రభుత్వం 2023లో 100 సీట్లతో మెడికల్ కళాశాలను మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి జూలై 5న జారీ చేసిన జీవోలో 2024-25 విద్యాసంవత్సరం నుంచి తరగతులను ప్రారంభించాలని పేర్కొంది. కళాశాల భవన నిర్మాణం కోసం రూ.180 కోట్లు మంజూరు చేస్తూ.. పరిపాలనా అనుమతుల కోసం సెప్టెంబర్ 16న జీవో నెం 162 జారీ చేసింది. నూతన భవన నిర్మాణం కోసం ఎంసీహెచ్ పక్కనే 14 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన అనంతరం 50 సీట్లకు కుదించి, పాత కలెక్టరేట్ భవనంలో కళాశాల ప్రారంభానికి ఏర్పాట్లు చేశారు.



మెడికల్ కళాశాల భవనం

వసతులు లేవని నిరాకరణ

మెడికల్ కళాశాల ఏర్పాటు కోసం నేషనల్ మెడికల్ కౌన్సిల్ అనుమతి కోసం దరఖాస్తు చేసుకోగా తొలిసారి జూన్ 24న జాతీయ వైద్య విధాన మండలి సభ్యులు తనిఖీ చేశారు. తాత్కాలిక భవనంలో నిబంధనల మేరకు వసతులు కల్పించి, బోధనా సిబ్బంది నియామకాలు చేపట్టాలని సూచించింది. ఈ సూచనల మేరకు నియామకాలు, ప్రమాణాలు లేకపోవడంతో అనుమతులు నిరాకరించారు. ఆగస్టు 13న రెండోసారి అప్పీల్ చేసుకోగా మరోసారి అనుమతులు నిరాకరించారు. మూడో ప్రయత్నంలో నిబంధనలమేరకు ఏర్పాట్లు చేసి అధికారులు మరోసారి దరఖాస్తు చేసుకున్నారు. దీనికితోడు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, కలెక్టర్ రాహుల్ రాజ్, స్టేట్ హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, డీఎంఈ డా.వాణి ప్రత్యేక చొరవతో ఎట్టకేలకు ఎన్ఎంసీ మెదక్ వైద్య కళాశాలకు పచ్చజెండా ఊపింది. నోటిఫికేషన్ రాగానే స్టేట్ కౌన్సెలింగ్ కోసం ఏర్పాట్లు చేస్తామని ప్రిన్సిపల్ రవీందర్ తెలిపారు.

ఆధునాతన వైద్య సేవలు: కలెక్టర్

రాష్ట్ర ప్రభుత్వం కృషి, వైద్య ఆరోగ్యశాఖ సంకల్పంతో మెదక్ జిల్లా వైద్య కళాశాలకు అనుమతి వచ్చినట్లు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కృషి, ఎమ్మెల్యే రోహిత్‌రావు చొరవతోనే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. మెడికల్ కళాశాల ఏర్పాటుతో అధునాతన వైద్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.

నిబంధనలు పాటించని

ఆస్పత్రి ల్యాబ్‌లు సీజ్



ల్యాబ్ రికార్డులు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 10 : సంగారెడ్డి పట్టణంలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల ల్యాబ్‌లను ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని శ్రీచరిత ఆస్పత్రిలో నిబంధనలు పాటించకపోవడంతో ల్యాబ్‌ను సీజ్ చేసి నోటీసులు జారీ చేశారు. సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని మరో ఆస్పత్రిలో ధరల పట్టిక ప్రదర్శించకపోవడంతో పాటు ఎలీసా పరీక్ష చేయకుండానే డెంగ్యూగా నిర్ధారణ చేస్తున్నట్లు గుర్తించిన ఆమె మరో ల్యాబ్‌ను సీజ్ చేశారు. ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్ నిర్వాహకులు నిబంధనలు పాటించకపోతే క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

తండ్రీకొడుకులను కబలించిన ట్యాంకర్

ఆసుపత్రికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం

మాసాయిపేట సెప్టెంబర్ 9 : అతివేగంగా వస్తున్న ట్యాంకర్ బైక్‌పై వెళ్తున్న తండ్రీ కొడుకులను బలిగొన్నది. మాసాయిపేట మండలం రామంతాపూర్ చౌరస్తా వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆసుపత్రికి చికిత్స కోసం వెళ్తున్న ఇద్దరు మృతి చెందారు. చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామానికి చెందిన దొంతి మల్లేశం (37) తండ్రి దొంతి బూదయ్య(65)తో కలిసి హైదరాబాద్‌లోని ఆసుపత్రికి బైక్‌పై వెళ్తున్నారు. రామంతపూర్ చౌరస్తా వద్ద 44వ జాతీయ రహదారిపె అతివేగంగా వస్తున్న ట్యాంకర్ వీరిని ఢీకొట్టింది. ట్యాంకర్ టైర్ల కింద నలిగి దొంతి మల్లేశం (37) అక్కడికక్కడే మృతిచెందగా.. తండ్రి దొంతి బూదయ్య (65) ఆసుపత్రికి తరలిస్తోండగా మృతి చెందారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాలను తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.



దొంతి మల్లేశం (ఫైల్)



దొంతి బూదయ్య (ఫైల్)

సూరారంలో విషాదం

రోడ్డు ప్రమాదంలో తండ్రి కొడుకు మృతి చెందడంతో చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన దొంతి బేదయ్య, కుమారుడు మల్లేష్ ఒకే ప్రమాదంలో చనిపోవడంతో ఆ కుటుంబం రోదనలు మిన్నంటాయి. మల్లేష్ చిన్నశంకరంపేట ఎంపీపీ కార్యాలయంలో స్కావేంజర్‌గా పని చేస్తున్నాడు. ఆయన భార్య మైనిక, రెండేళ్ల కూతురు ఉన్నారు.



లారీ చక్రం కింద తీవ్ర గాయాలతో బూదయ్య

ప్రశాంతంగా నాస్ పరీక్ష

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 10: సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన నాస్(నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పాఠశాల విద్యార్థులు చదువుల్లో కనబరుస్తున్న సామర్థ్యాలను పరీక్షించేందుకు కేంద్రం ఏటా జాతీయ సాధన సర్వే పేరిట పరీక్ష నిర్వహిస్తున్నది. ఈ విద్యా సంవత్సరం కూడా 3,6,9వ తరగతుల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ముందస్తుగా అంచనాలు వేసి ప్రగతిని పెంచేందుకు వీలుగా నాస్ పరీక్ష నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 3వ తరగతి 10,788 మంది, 6వ తరగతి 11,525 మంది, 9వ తరగతి 13,208 మంది మొత్తం 35,521 మంది పరీక్ష రాశారని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

మెడికల్ కాలేజీలో సజావుగా ఇంటర్వ్యూలు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 10: సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో మంగళవారం వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. అదనపు కలెక్టర్ చంద్రశేకర్ సమక్షంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 94 మంది హాజరయ్యారు. వీరిలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు 46 మంది, సీనియర్ రెసిడెంట్లు 19 మంది, ట్యూటర్లు 29 మంది ఉన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.సుధామాధురి, ఇతర విభాగాధిపతులు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

మానసిక వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

జిన్నారం, సెప్టెంబరు 10: జిన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు సమస్యలపై స్పందించే విధానం, మానసిక, వ్యక్తిత్వ నిపుణులు డాక్టర్ మధు మానసిక ఆరోగ్యం, ఏకాగ్రత పెంపుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణకుమార్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన అధికారులు

రాయికోడ్, సెప్టెంబరు 10: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు రాయికోడ్ మండలంలోని పలు గ్రామాల్లో నష్టపోయిన పంట పొలాలను ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాహుల్ సమక్షంలో రాయికోడ్ డివిజన్ ఏడీఏ సత్యనారాయణ, ఏవో సారికలు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొలాల్లో నీరు నిండితే తొలగించాలన్నారు. రైతులెవ్వరూ అధైర్యపడొద్దని, పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి వెంటనే సమర్పిస్తామని తెలిపారు.

కూలిన ఇళ్లకు నష్ట పరిహారం అందిస్తాం: ఆర్ఐ గంగాధర్

నిజాంపేట, సెప్టెంబరు 10: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కూలిన ఇళ్లను పరిశీలించిన నష్ట పరిహారం అందేవిధంగా కృషి చేస్తామని ఆర్ఐ గంగాధర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని నందగోకులలో కూలిన ఇళ్లను పరిశీలించి మాట్లాడారు. వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు.

యాజమాన్య పద్ధతులతో ఫలితాలు: శాస్త్రవేత్త డాక్టర్ శోభ

నర్సాపూర్, సెప్టెంబరు 10: యాజమాన్య పద్ధతులతో మంచి ఫలితాలు సాధించొచ్చని నత్నాయపల్లి వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శోభ పేర్కొన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ వరి నాట్లు పూర్తయి జిల్లాలోని పంటలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. యాజమాన్య పద్ధతులతో పాటు సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి ఫలితం ఉంటుందని సూచించారు.

దాతల సహకారంతో వసతి

- మలన్న సన్నిధిలో 80 గదుల నిర్మాణానికి చర్యలు
- రూ.14కోట్ల అంచనా వ్యయంతో రూపకల్పన
- సబ్‌స్టేషన్ సమీపంలో ఆలయ స్థలం కేటాయింపు
- అనుమతికోసం దేవాదాయశాఖ కమిషనర్‌కు ప్రతిపాదన

చేర్యాల, సెప్టెంబరు 10 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయాభివృద్ధిలో కీలకమైన దాతల సహకారంతో భక్తులకు వసతి కల్పించేందుకు ఆలయాధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు డోనర్ స్కీంద్వారా నాలుగు అంతస్తులలో 80గదుల నిర్మాణానికి సంకల్పించారు. ఒక్కో అంతస్తులో 20గదుల చొప్పున నాలుగు అంతస్తులలో చేపట్టనున్న సముదాయానికి రూ.14కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేయగా, ఒక్కో గదికి రూ.18లక్షల చొప్పున నిధులు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఆయా గదుల భవన సముదాయం నిర్మాణానికి సబ్‌స్టేషన్ సమీపంలో ఆలయ పరిధిలోని 1.15 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఈ విషయమై దేవాదాయశాఖ కమిషనర్ అనుమతి కోసం ఆలయ వర్గాలు ప్రతిపాదనలు పంపించడంతో పాటు దాతలకు సమాచారమిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు.

శిథిలావస్థలో వసతి గదులు

మల్లన్న ఆలయ సందర్శనార్థం వచ్చే భక్తుల బస వసతి కల్పనకు సంబంధించి ఆలయంలో ప్రభుత్వం తరుఫున గదులు ఏమీ లేవు. 130కి పైగా గదులు దాతలు నిర్మించి విరాళంగా ఇచ్చినవే. వాటిని మల్లికార్జునస్వామి, మేడలమ్మ, కేతలమ్మల పేరిట బ్లాకులవారీగా కేటాయించారు. మేడలమ్మ బ్లాకులో 46, మల్లికార్జునస్వామి బ్లాకులో 22, కేతలమ్మ బ్లాకులో 60చొప్పున గదులు ఉన్నాయి. వీటిలో మల్లికార్జునస్వామి బ్లాకులో కొన్నింటిని సామగ్రి నిల్వకు వినియోగిస్తున్నారు. మరికొన్ని శిథిలావస్థలో ప్రమాదకరంగా మారాయి. ఏళ్ల క్రితం నిర్మించడంతో పెచ్చులూడి, చిన్నపాటి వర్షం కురిసినా ఊరుస్తున్నాయి. ప్రమాదకరంగా మారినప్పటికీ తప్పనిసరి పరిస్థితులలో భక్తులు బస చేస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. నిర్వహణ కూడా సరిగా లేకపోవ డంతో భక్తులకు ఆశించిన ప్రయోజనం చేకూరడం లేదు. కొన్నింటిని భక్తులకు ఇవ్వడం కూడా మానేశారు. జాతర సమయంలో లక్షలాదిగా భక్తులు తరలివస్తున్నప్పటికీ ఆయా గదులను ఆలయవర్గాలకు, ప్రభుత్వ శాఖల అధికారులు, ఇతర ప్రముఖులకు కేటాయిస్తుండటంతో భక్తులు పడుతున్న బాధలు అన్నీ ఇన్నీకావు.



వసతి గదుల భవన సముదాయనిర్మాణ ప్రతిపాదిత స్థలం

100 గదులు సంకల్పించినా...

డోనర్ స్కీం ద్వారా ప్రతిపాదిత ప్రదేశంలో ముందస్తుగా 5 అంతస్తులలో 100వసతి గదులు నిర్మించేందుకు కసరత్తు చేపట్టారు. కానీ అంచనా వ్యయం పెంపు, ఇతరత్రా కారణాలతో నాలుగు అంతస్తులలో 80 గదులు నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. అందుకు ఒక్కోగదిలో హాల్, బెడ్ రూం, రెండు బాత్‌రూంలు, కిచెన్ ఉండేవిధంగా డిజైన్ చేశారు. 80గదులకు సంబంధించి అందరు దాతలు ముందుకువచ్చిన అనంతరం సమావేశం ఏర్పాటుచేసి డబ్బుల చెల్లింపు, నిర్మాణం, బ్లాకుల కేటాయింపు, ఇతర త్రా అంశాలు చర్చించి నిర్మాణం పనుల ప్రారంభించేవిధంగా కార్యాచరణ చేపట్టారు. అన్నీ కలిసివస్తే అందరూ సకాలంలో డబ్బు లు చెల్లించి పనులు చేపడితే సుమారు ఏడాదిన్నరలో 80గదుల సముదాయం అందుబాటులోకి రానుంది. అంతకుమించి దాతలు ముందుకువస్తే 5వ అంతస్తు నిర్మాణం చేపట్టేందుకు ప్లాన్ రూపొందించారు.

ప్రతిపాదనలు పంపించాం..



భక్తులకు మెరుగైన వసతి కల్పించాలని డోనర్ స్కీం ద్వారా 80గదుల భవన సముదాయ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. అందుకు రూ.14కోట్ల వ్యయం కానుంది. దేవాదాయశాఖ కమిషనర్ సూచనానుసారం చర్యలు తీసుకుంటాం.

-ఈవో బాలాజీశర్మ

గతంలో 63గదులు ప్రతిపాదించినా...

కొన్నాళ్లక్రితం ఎండీఎస్-బ్లాక్‌లో 19గదులను కూల్చివేసి 63గదులను నిర్మించాలని ఆలయవర్గాలు ప్రతిపాదనలు పంపించారు. కానీ కూల్చివేయాలనుకున్న గదులకు సంబంధించిన డోనర్ల అభిప్రాయసేకరణతో పాటు ఇతరత్రా అంశాలలో సమస్యలు ఉత్పన్నమవనున్నందున పరిగణనలోకి తీసుకోకుండా వివాదరహితంగా 80గదుల భవన సముదాయానికి చర్యలు తీసుకున్నారు.

నిర్వహణభారంపై ఆసక్తి

దాతలు దశలవారీగా డబ్బులు చెల్లించనున్న క్రమంలో పనుల ఆలస్యం, పురోగతి ఇతర్రతా అంశాలపై జవాబుదారీతనంతో పాటు నిర్వహణభారం, ఆలయవర్గాల పనితీరుపై ఆసక్తి నెలకొంది. గతంలో గదుల నిర్మాణానికి విరాళాలు తీసుకున్నా నిర్మాణం చెల్లించకపోగా.. డబ్బులూ తిరిగి ఇవ్వలేదు. విషయమై ఓ అధికారిపై కేసు కూడా నమోదైంది. ఈ ప్రభావం ప్రస్తుత డోనర్ స్కీంపై చూపనుండటంతో ఏవిధంగా వ్యవహరిస్తారన్న విషయమై ఆసక్తి నెలకొన్నది.

ఎడారి దేశంలో అనామక చావు

- దుబాయిలో మెదక్ జిల్లావాసి మృతి
- ఉపాధి కోసం నెల క్రితమే వలస
- మృతదేహాన్ని తెప్పించాలని కుటుంబ సభ్యుల వేడుకోలు



వసురామ్(ఫైల్)

హవేళిఘణపూర్, సెప్టెంబరు 12: ఉపాధి కోసం దుబాయ్ దేశానికి వలస వెళ్లిన ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మెదక్ జిల్లా హవేళిఘణపూర్ మండలంలోని సుల్తాన్‌పూర్‌తండాలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. కుటుంబీకుల వివరాల ప్రకారం.. తండాకు చెందిన రమావత్ వసురామ్(40) నెలరోజుల క్రితం ఉపాధి కోసం దుబాయ్‌కు నిజామాబాద్ జిల్లాలోని ఓ ఏజెంట్ ద్వారా వలస వెళ్లాడు. వారం క్రితం కంపెనీ నుంచి బయటకు వచ్చిన వసురామ్ అనారోగ్యంతో మృతిచెందినట్లు ఏజెంట్ ఫోన్‌చేసి తెలిపాడు. మసురామ్ మరణవార్త ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ విషయాన్ని ఎవరికి విన్నవించాలో తెలియక కుటుంబీకులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. తమ కుటుంబ పెద్ద దిక్కైన వసురామ్‌ను కడసారి చూసే భాగ్యం కల్పించాలని వేడుకుంటున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. అధికారులు, నాయకులు స్పందించి తన భర్త మృతదేహన్ని స్వగ్రామానికి తీసుకురావాలని భార్య వేడుకుంటోంది.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో పోలీసులు

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 10 : రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్న సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్లో అమ్ముతున్నారని సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం దాడిచేసి పట్టుకున్నారు. టాస్క్ ఫోర్స్, టూ టౌన్ పోలీసులు రైడ్ చేసి 55 క్వింటాళ్ల రేషన్ బియ్యం, రైస్ అమ్మిన డబ్బులు రూ.15,980 స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో సిద్దిపేటకు చెందిన మాడ శ్రీనివాస్, కోదండమ్ శంకర్, తూర్పాటి అశోక్, వానరాశి సంజీవ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏదైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ అధికారులకు 8712667445, 8712667446, 8712667447 నంబర్ల ద్వారా సమాచారం అందించాలని సూచించారు.

మామకు తలకొరివి పెట్టిన కోడలు



మామకు తలకొరివి పెడుతున్న కోడలు

చేగుంట , సెప్టెంబరు 10: మామకు కోడలు తలకొరివి పెట్టిన సంఘటన చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన వీరగొని భూమాగౌడ్ అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. అతని కుమార్డు ఎల్లగౌడ్ కూడా కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఎల్లగౌడ్‌కు ముగ్గురు ఆడ పిల్లలుకాగా పెండ్లి అయ్యింది. దీంతో ఎల్లగౌడ్ భార్య లక్ష్మి మామకు తలకొరివి పెట్టింది.

డిజిటల్ యాప్స్‌తో విప్లవాత్మక మార్పులు

- జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్



డిజిటల్ యాప్స్ కోర్సు వివరాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న వ్యవసాయ అధికారి గోవింద్ సిబ్బంది

మెదక్ కల్చరల్, సెప్టెంబరు 10 : రాబోయే రోజుల్లో వ్యవసాయ రంగంలో డిజిటల్ యాప్స్‌తో విప్లవాత్మకమైన మార్పులు వస్తాయని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ అన్నారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో డిజిటల్ యాప్, డిజిటల్ లైబ్రరీ, డిజిటల్ వ్యవసాయ కోర్సులు, క్యాబి బయో ప్రొటెక్షన్ పోర్టల్, ప్లాంట్ వైస్ ప్లస్నాలెడ్జ్ బ్యాంక్, క్రాప్ స్ప్రేయర్ వంటి యాప్‌లకుసంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునికత సాంకేతికతను అందిపుచ్చుకున్నప్పుడే వ్యవసాయ రంగంలో అధిక లాభాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారులు రాజ్ నారాయణ, సోమలింగారెడ్డి, హర్ష, దేశి కోఆర్డినేటర్ అమరేష్‌కుమార్, సెంటర్ ఫర్ అగ్రికల్చర్ అండ్ బయోసైన్స్ ఇంటర్నేషనల్ దక్షిణాసియా కోఆర్డినేటర్ మధుమంజరి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు 10 : రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నేతి కైలాసం తెలిపారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలకు 80 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 16 మంది బాలికలు, 16 మంది బాలురను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నేతి కైలాసం మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా జట్టు ఈ నెల 21, 22, 23న సిరిసిల్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి మేరీ, పీఈటీలు వెంకటేశ్వర్లు, సతీష్, రాజ్‌కుమార్, మహేష్, నవీన్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా జూనియర్ అథ్లెటిక్ పోటీలు

- రాష్ట్రస్థాయి 30 మంది ఎంపిక

మెదక్ అర్బన్, సెప్టెంబరు 10 : తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ జిల్లా స్థాయి పోటీలు మంగళవారం స్థానిక ఇందిరాగాంధీ మైదానంలో ఉత్సాహంగా జరిగాయి. 400 మంది క్రీడాకారులు పాల్గొనగా.. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 30 మంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 19, 20వ తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి మధుసూదన్ తెలిపారు.

జాతీయ పోటీలకు మయాంషిరెడ్డి ఎంపిక



మయాంషిరెడ్డి

వట్‌పల్లి, సెప్టెంబరు 10 : మండలంలోని గొర్రెకల్ గ్రామానికి చెందిన విద్యార్థిని మయాంషిరెడ్డి జాతీయస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికైంది వట్‌పల్లిలోని మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శివరాంరెడ్డి కూతురైన మయాంషిరెడ్డి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుతుంది. అండర్ 14 బాలికల విభాగంలో తమిళనాడులో నిర్వహించిన జాతీయ క్రికెట్ టోర్నమెంట్‌లో కాంస్య పతకం సాధించింది. తాజాగా జాతీయ స్థాయిలో నిర్వహించబోయే ఖేలో ఇండియా-24 పోటీలకు ఎంపికైంది.



చాకలి ఐలమ్మ వర్ధంతి..

మెదక్ కలెక్టరేట్‌లో జిల్లా బీసీ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ రాహుల్ రాజ్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

-మెదక్ అర్బన్, సెప్టెంబరు 10



ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేత నీలం మధు

ఘన నివాళి..

చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని చిట్కుల్‌లోని ఐలమ్మ కాంస్య విగ్రహానికి కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ మంగళవారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. చాకలి ఐలమ్మ స్ఫూర్తిని భావితరాలకు అందించాలన్న సంకల్పంతో దేశంలోనే అతి పెద్ద కాంస్య విగ్రహాన్ని చిట్కుల్ గ్రామంలో ప్రతిష్ఠించామని ఆయన గుర్తు చేశారు.

-పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 10

వర్గల్ విద్యాధరి క్షేత్రం పనితీరు అద్భుతం

- కంచి పిఠాధిపతులు శ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామిజీ



కంచి పీఠాధిపతిని కలిసిన చంద్రశేఖర శర్మ సిద్ధాంతి

వర్గల్, సెప్టెంబరు 10 : వర్గల్ క్షేత్రంలో కంచి పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యాధరి క్షేత్రం నిర్వహణ అద్భుతంగా ఉందని కంచి పిఠాధిపతులు శ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామిజీ ఉద్బోధించారు. మంగళవారం వర్గల్ విద్యాధరి క్షేత్రం వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు కంచి పీఠంకు వెళ్లి చాతుర్మాస్య దీక్షలో ఉన్న కంచి పీఠాధిపతిని కలిసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా విద్యాధరి క్షేత్రం ఆలయ కమిటీ సభ్యులతో శ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామిజీ మాట్లాడుతూ విద్యాధరి క్షేత్రం ద్వారా భక్తులకు మరింత సేవలు విస్తృతం చేయ్యాలని, ప్రజల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందించాలన్నారు. అనంతరం స్వామిజీని చంద్రశేఖర శర్మ సిద్ధాంతి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మర్పడగ శ్రీ సంతాన మల్లిఖార్జున క్షేత్రం నిర్వాహకుడు హరినాథ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గీతమ్‌లో ఉత్తేజకర పోటీలు

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 10 : ఈ నెల 25న ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫార్మసీ విద్యార్థుల కోసం ఉత్తేజకర పోటీలను నిర్వహించాలని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ సంకల్పించింది. వ్యాస రచన, పోస్టర్, మౌఖిక ప్రదర్శన, క్విజ్ వంటివి పోటీలు ఉంటాయని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుర్తింపు పొందిన పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల ఫార్మసీ విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ మెయిల్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. విజేతలకు బహుమతులు, అవార్డులను ప్రదానం చేస్తామని, మరిన్ని వివరాల కోసం విద్యార్థి సమన్వయకర్తలను సంప్రదించాలని పేర్కొన్నారు.

కాలువ కనుమరుగు.. రోడ్డుపై వరద పరుగు

కాలువ బఫర్ జోన్‌లో నిర్మాణాల ఫలితం.. ప్రజలకు ఇబ్బందులు



తెల్లాపూర్‌లోని వంద ఫీట్ల రోడ్డు(రేడియల్ రోడ్డు 30 ఎక్స్‌టెన్షన్)పై వరదనీరు

రామచంద్రాపురం, సెప్టెంబరు 10 : అధికారుల తప్పిదాలతో కాలువలు కనుమరుగవుతున్నాయి. ఫలితంగా వరదనీరు రోడ్లపై పరుగుపెడుతుండడంతో వాహనదారులు, ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. తెల్లాపూర్‌లోని చెలికుంట చెరువు అలుగు నీరు వరద కాలువ ద్వారా మేళ్ల చెరువులోకి చేరాలి. కానీ, కొందరు వ్యక్తులు ఆ కాలువను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టడం నీరంతా రోడ్లపైకి వస్తున్నది. కాలువ పై భాగంలో బఫర్ జోన్‌లో ఓ ఓ బిల్డర్ నిర్మాణాలు చేపడుతుండడంతోపాటు ఆ వ్యర్థాలను కాలువలో డంప్ చేస్తూ పూడ్చే ప్రయత్నం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. 33 ఫీట్ల వెడల్పుతో పారుతున్న ఈ కాలువపై గత ప్రభుత్వ హయాంలో ఇద్దరు మాజీ మంత్రుల అండదండలతో ఓ బిల్డర్ వంతెన నిర్మాణానికి అనుమతి పొంది సొంత ఖర్చుతో కేవలం 15 నుంచి 18 ఫీట్ల వెడల్పుతో వంతెన నిర్మించాడు. ఈ వంతెన కేవలం తన భూమిలోకి వెళ్లడానికే ఉపయోగపడుతుంది. ఈ విషయంలో అధికారులు బిల్డర్‌కు అనుకూలంగా వ్యవరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వంతెనతో పాటు, అక్రమ నిర్మాణలతో వరద కాలువకు పలు ఆటంకాలు ఏర్పడి మేళ్ల చెరువుకు చేరాల్సిన నీరు రోడ్లపై పారుతున్నది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది.

తమను సంప్రదించకుండా కల్వర్టులు కట్టారు..

రేడియల్ రోడ్డు, కల్వర్టుల నిర్మాణానికి కాంట్రాక్టరు, సంబంధిత అధికారులు తమను సంప్రదించలేదని ఇరిగేషన్ ఏఈ సంతోషిని స్పష్టం చేశారు. 15 మీటర్ల వెడల్పుతో పారుతున్న వరద కాలువకు 2 లేదా 3 మీటర్ల వెడల్పుతో వంతెన నిర్మిస్తే ఎలా సరిపోతుందన్నారు. అందుకే రోడ్డుపై నీరు పారుతుందన్నారు. వరద తీవ్రత, కాలువల వెడల్పులపై కల్వర్టు నిర్మాణం ఆధారపడి ఉంటుందన్నారు.



వరద కాలువపై నిర్మించిన వంతెన

తొమ్మిది రోజుల తరువాత గర్భగుడిలో పూజలు

- ఏడుపాయల్లో తగ్గిన వరద



పాపన్నపేట, సెప్టెంబరు 10: మంజీర వరదలు తగ్గుముఖం పట్టాయి. దీంతో తొమ్మిదిరోజుల పాటు జల దిగ్బంధంలో చిక్కుకున్న మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని వనదుర్గమ్మ ఆలయం మంగళవారం తెరుచుకున్నది. ఆలయాన్ని శుద్ధిచేసిన అర్చకులు.. అనంతరం దుర్గమ్మను ఎరుపు రంగు వస్త్రాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు చేసి, భక్తుల దర్శనానికి అనుమతించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ నెల 1 నుంచి మంజీర నది వరదలు ఆలయాన్ని ముంచెత్తడంతో, రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి పూజలు నిర్వహించిన విషయం తెలిసిందే.



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

పట్టుబడిన పుష్ప బ్యాచ్

140 కిలోల గంజాయి స్వాధీనం

జహీరాబాద్, సెప్టెంబరు 10: గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న 140 కిలోల ఎండు గంజాయిని సోమవారం సాయంత్రం పట్టుకుని, నిందితులను అరెస్టు చేశామని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలను వెల్లడించారు. ఈనెల 9న సాయంత్రం చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రహదారిపై ఆనంద్ దాబా వద్ద ఎస్ఐ రాజేందర్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి జహీరాబాద్ మీదుగా కర్ణాటకకు వెళ్తున్న బొలెరోను తనిఖీ చేయగా.. వెనకభాగంలో చెక్క కింద ఉంచిన 140 కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. ఈ మేరకు బొలెరో వాహనాన్ని, 140 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, లఖన్, సిద్ధిక్‌ను అరెస్ట్ చేశామన్నారు. పరారీలో ఉన్న సునీల్, కిరణ్, మల్లేష్‌నాయక్‌లను త్వరలో పట్టుకుంటామని ఎస్పీ చెప్పారు. గంజాయి విలువ రూ.35 లక్షలు ఉంటుందన్నారు. కాగా ఒడిశా రాష్ట్రంలోని మల్కాన్‌గిరి ప్రాంతానికి చెందిన రాహుల్ అనే వ్యక్తి ద్వారా కర్ణాటకలోని బాల్కికి చెందిన మల్లుగొండ అనే నేర ప్రవృత్తిగల వ్యక్తికి లఖన్ (శంషాపూర్‌వాడి-బాల్కి, బీదర్), సిద్ధిరామ్(బసవేశ్వరచౌక్-బాల్కి), సునిల్, కిరణ్, మల్లేష్‌నాయక్ ద్వారా కార్లలో, బొలెరో వాహనాల్లో గంజాయిని తీసుకొచ్చి అప్పగిస్తామని నిందితులు చెప్పారు. అదే తరహాలో వీరంతా కలిసి ఒడిశా రాష్ట్రంలోని మల్కాన్‌గిరి నుంచి బొలెరోలో 140 కిలోల ఎండు గంజాయిని తరలిస్తున్నారని ఎస్పీ తెలిపారు. గంజాయి అక్రమ రవాణాను గుట్టురట్టు చేసిన జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, పట్టణ సీఐ శివలింగం, చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి, పోలీసులను ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్లు విజయ్‌క్రిష్ణ, రమేష్, మల్లేష్, శ్రీకాంత్, మాణిక్‌రెడ్డి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్

మిషన్ భగీరథ.. కార్మికుల వ్యథ!

- అగమ్య గోచరంగా ఉద్యోగుల పరిస్థితి
- 25 మందికి పది నెలలుగా అందని వేతనాలు
- స్పందించని అధికారులు
- చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- కాశీపూర్‌లో భగీరథ ట్యాంకు వద్ద నిరసన

కంది, సెప్టెంబరు 10: సంగారెడ్డి జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కంది మండలంలోని మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులు పరిస్థితి దయనీయంగా మారింది. పది నెలలుగా వేతనాలు లేక అవస్థలు పడుతున్నారు. జీతాల కోసం కాంట్రాక్టర్‌కు ఎన్నిసార్లు ఫోన్‌చేసినా స్పందించడం లేదని, అధికారులు సైతం చేతులెత్తేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు వెంటనే జీతాలు ఇప్పించాలని కోరుతూ కాశీపూర్‌లోని మిషన్ భగీరథ ట్యాంకు వద్ద మంగళవారం కార్మికులు యాదయ్య, నర్సింహులు, శ్రీను, రవి, రాజ్‌కుమార్, సాయి, గురువయ్య, శ్రీకాంత్, గోవింద్, లక్ష్మణ్, కైసర్ ఆందోళన చేశారు.



కాశీపూర్ మిషన్ భగీరథ ట్యాంకు వద్ద మంగళవారం ఆందోళన చేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు

సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 200 పైచిలుకు కాంట్రాక్ట్ కార్మికులు ఉండగా.. ఒక్క కంది మండలంలో దాదాపు 25 మంది ఉన్నారు. వీరి జీతం నెలకు రూ.9,500. వీరిలో లైన్ మన్లుగా వ్యవహరించేవారు ఎక్కువగా ఉన్నారు. వీరంతా మండలంలో ఆయా గ్రామాలకు ఉన్న మిషన్ భగీరథ సరఫరా లైన్ లీకేజీలు లేకుండా, నీటి సరఫరాలో అంతరాయం కలుగకుండా ఎప్పటికప్పుడు మరమ్మతులు చేస్తుంటారు. అయితే వీరికి జీతాలు పండుగకు మాత్రమే అందుతాయి. అది కూడా ఆరునెలలు కష్టపడితే రెండునెలల వేతనం ఇస్తారు. మండల పరిధిలోని ఓడీఎఫ్ నుంచి నీరు సరఫరా అయ్యే పైప్‌లైన్ రిపేర్ చేస్తూ గతేడాది ఓ కార్మికుడికి దెబ్బ తగిలింది. రూ.లక్ష అప్పుచేసి కార్మికుడే చికిత్స చేయించుకున్నాడు. మిషన్ భగీరథ కాంట్రాక్టర్ కానీ, సంబంధిత అధికారులు కానీ ఒక్క రూపాయి ఇవ్వలేదు. ఇప్పటివరకు ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాదబీమా వంటి సౌకర్యాలు లేవని కార్మికులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి వెంటనే తమకు వేతనాలు ఇప్పించాలని మిషన్ భగీరథ కార్మికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

కాంట్రాక్టర్‌కు బిల్లులు రాక జీతాలు ఇవ్వడంలో జాప్యం

మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మికులకు కొన్నినెలలుగా జీతాలు రాకపోవడం వాస్తవమే. ఈ విషయంలో మేం కూడా కాంట్రాక్టర్‌ను అడిగాం. కాంట్రాక్టర్‌కు కూడా ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో వేతనాల విషయం ఆలస్యమవుతున్నది. త్వరలోనే అందరికీ జీతాలు అందేలా చర్యలు తీసుకుంటాం.

- విజయలక్ష్మి, మిషన్ భగీరథ ఈఈ

పదినెలలుగా జీతాలు లేవు



పదినెలలుగా జీతాలు లేక మా కుటుంబం గడిచే పరిస్థితి లేదు. ఇప్పటికే బతకడానికి ఎన్నో అప్పులు చేశాం. ఆరోగ్య సమస్యలు వస్తే పట్టించుకునే నాధుడే లేరు. అధికారులు ఎప్పుడు పిలిచినా విధులకు వెళ్లాలి. పైపులు లీకైనప్పుడు మరమ్మతులు పూర్తిచేసి, నీటి సరఫరా అయ్యేవరకూ అన్నం, నీళ్ల లేకుండా పనిచేస్తాం. ఉన్నతాధికారులు ఒక్కసారి మా పరిస్థితి ఆలోచించి జీతాలు ఇప్పించాలి.

- నర్సింహులు, మిషన్ భగీరథ కార్మికుడు



అప్పులు చేసి బతకలేకపోతున్నాం

నెలలు తరబడి జీతాలు రాకపోవడంతో అప్పులుచేసి బతకుతున్నాం. బతుకు భారం అవుతున్నది. అప్పుల వాళ్లు మమ్మల్ని వేధిస్తున్నారు. మా పైఅధికారులకు జీతాల విషయమై చాలాసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. పనులు మాత్రం చేయించుకుంటారు. ఇలాంటి పరిస్థితి మరే కార్మికుడికి రావద్దు. ఉన్నతాధికారులు దయచేసి మాకు వెంటనే జీతాలు ఇప్పించాలి.

- యాదయ్య, మిషన్ భగీరథ కార్మికుడు



సంగారెడ్డిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

సంగారెడ్డిలో పోలీసుల కవాతు

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 10: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా సంగారెడ్డి పట్టణంలో మంగళవారం సాయంత్రం పోలీసులు కవాతు నిర్వహించారు. పట్టణంలోని శాంతినగర్, కల్వకుంట, నాల్సాబ్‌గడ్డ కాలనీల్లో పోలీసులు ఈ కవాతు నిర్వహించారు. సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, పట్టణ సీఐ భాస్కర్ ఆధ్వర్యంలో కవాతు జరిగింది. డీఎస్పీ సత్తయ్యగౌడ్ మాట్లాడుతూ పండుగల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం కవాతు నిర్వహించామన్నారు.

పాత పెన్షన్ అమలు హామీని నెరవేర్చాలి: తపస్

పెద్దశంకరంపేట, సెప్టెంబరు10: ప్రభుత్వం ఎన్నికలహామీలో ఇచ్చిన హామీ మేరకు పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని మెదక్ జిల్లా తపస్ ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ పేర్కొన్నారు. మంగళవారం పెద్దశంకరంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తాపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీ ఉద్యోగులకు పేస్కేల్ అమలు చేయాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద జీతాలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర బాధ్యులు సునార్ రమేష్, పెద్దశంకరంపేట, అల్లాదుర్గం మండలాల తపస్ అధ్యక్షులు తదితరులుపాల్గొన్నారు.

సంగారెడ్డిలో ప్రభుత్వాసుపత్రికి ట్రా'ఫికర్'

● ప్రహరీని ఆనుకొని చిరు వ్యాపారుల డబ్బాలతో కుదించుకుపోయిన రోడ్డు ● అడ్డదిడ్డంగా వాహనాలు ● భయాందోళనలో పాదచారులు

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 10: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట ప్రతినిత్యం ట్రాఫిక్ తీవ్రసమస్యగా మారుతున్నది. ఆసుపత్రికి రోజూ దాదాపు 2వేల మంది రోగులు జిల్లా నలుమూలల నుంచి వస్తుంటారు. వీరితో పాటు జనరల్ ఆసుపత్రిలో పనిచేసే దాదాపు వేయి మంది సిబ్బంది వస్తుంటారు. అయితే ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వీరంతా రాకపోకలు సాగిస్తుండటంతో జనరల్ ఆసుపత్రి ప్రాంగణమంతా రద్దీగా మారుతుంది. అయితే ప్రధాన రోడ్డుపై వాహనాల రాకపోకలు క్రమబద్ధీకరణ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులును ఎదుర్కొంటున్నారు. ఓ వైపు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, దాని ఎదురుగా పట్టణ పోలీస్‌స్టేషన్ ఉంది. ఈ ప్రాంతంలో రద్దీ కారణంగా పోలీసులు గతంలో తాత్కాలిక డివైడర్లను ఏర్పాటు చేశారు. కానీ వాహనాల స్పీడ్‌కు తాత్కాలిక డివైడర్లన్నీ కొట్టుకుపోయాయి. దీంతో ఆటోలు, ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలను అడ్డదిడ్డంగా నడిపిస్తున్నారు. పాదచారులు రోడ్డు దాటాలంటే పదినిమిషాలు వేచి చూడాల్సిందే. ఏ వైపు నుంచి ఏ వాహనం వస్తుందోననే భయం పాదచారులను వెంటాడుతున్నది.

అనుమతి లేకుండానే డబ్బాల ఏర్పాటు

ప్రభుత్వాసుపత్రి ప్రహరీ గోడకు ఆనుకొని ప్రైవేట్ వ్యాపారాల నిమిత్తం డబ్బాలు ఏర్పాటు చేశారు. మున్సిపల్ అధికారుల అనుమతి లేకుండానే చిరువ్యాపారులు





ఆసుపత్రి ఎదుట ట్రాఫిక్ పరిస్థితి, ప్రహరీని ఆనుకొని ఏర్పాటు చేసిన డబ్బాలు, తోపుడు బండ్లు

డబ్బాలు, తోపుడుబండ్లు ఏర్పాటు చేయడం వల్ల రోడ్డు కుదించుకుపోయింది. దీంతో పాటు ప్రైవేట్ అంబులెన్స్ వాహనాలు కూడా ఇక్కడే నిలుపుతున్నారు. ఆసుపత్రి వద్ద ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం ఉన్నప్పటికీ ఈ తోపుడు బండ్లు, డబ్బాలు ఏర్పాటు చేయడంతో పాటు అంబులెన్స్‌లు నిలపడంవల్ల ప్రయాణ ప్రాంగణం కనిపించడం లేదు. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి వెంట వచ్చిన వారంతా రోడ్డుపై బస్సుల కోసం వేచి చూడాల్సివస్తోంది. దీంతో జనంతో రద్దీ ఏర్పడి వాహనాలు గంటల తరబడి నిలిచిపోతున్నాయి. ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమైంది. గతంలో డబ్బాలు తొలగించినప్పటికీ మళ్లీ ఏర్పాటు చేసుకున్నారు.

పోలీసులకు పట్టదా?

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట ట్రాఫిక్ సమస్యతో ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నా పోలీసులు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఆసుపత్రి ఎదుటే పట్టణ పోలీస్‌స్టేషన్ ఉన్నప్పటికీ ట్రాఫిక్ పోలీసులు మాత్రం ట్రాఫిక్‌ను నియంత్రించడంలో విఫలమయ్యారని స్థానికులు మండిపడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నియంత్రిస్తే వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు అవకాశం వుంటుందని పలువురు చెబుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోపోవడం వల్ల వాహనదారులు ఇష్టారీతిగా వాహనాలను తోలుతున్నారు. దీంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఒక్కోసారి ప్రమాదాలు జరిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా పోలీసులు స్పందించి ఆసుపత్రి ఎదుట ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుదాఘాతానికి గురైన యువకుడి మృతి



నార్లపల్లి ప్రభు(ఫైల్)

పాపన్నపేట, సెప్టెంబర్ 10: విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాల పాలైన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని పొడ్చన్‌పల్లిలో సోమవారం రాత్రి చోటుచేసుకున్నది. పాపన్నపేట ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నార్లపల్లి ప్రభు(27) గత నెల 25న తన పొలం వద్ద స్టాటర్ రిపేర్ చేస్తుండగా కరెంట్ షాక్‌కు గురై తీవ్ర గాయాలపాలై అక్కడే పడిపోయాడు. మరునాడు ఉదయం అటువైపు వెళ్ళిన రైతులు గమనించి హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. ఒక్కగానొక్క కొడుకు అకాల మరణంతో తండ్రి ముత్తయ్య, తల్లి సోచవ్వ కన్నీరు మున్నీరయ్యారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

చిన్నముబారక్‌పూర్‌లో వ్యక్తి అదృశ్యం



ఎర్రోళ్ల రాజు

కల్హేర్, సెప్టెంబరు 10: సిర్గాపూర్ మండల పరిధిలోని చిన్నముబారక్‌పూర్‌లో ఎర్రోళ్ల రాజు(38) అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. మంగళవారం సిర్గాపూర్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. రాజుకు కల్లు తాగే అలవాటు ఉందని, వారం రోజులుగా తాగటం మానివేశాడని, అయితే సోమవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. ఇంట్లో నుంచి వెళ్లిన సమయంలో తెల్లని షర్టు, నల్లని ప్యాంటు ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదని, భార్య రుక్మిణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుతుచున్నట్లు తెలిపారు.

మండపాల వలంటీర్లు భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించాలి: డీఎస్పీ

నారాయణఖేడ్, సెప్టెంబరు 10: వినాయక మండపాల నిర్వాహకులు, వలంటీర్లు బ్యాడ్జీలు ధరించి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించాలని డీఎస్పీ వెంకట్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఖేడ్‌లో ఖేడ్- నిజాంపేట మండలాల వినాయక మండపాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా వలంటీర్లు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కృషి చేయాలన్నారు. మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదన్నారు. నిమజ్జన శోభాయాత్రలకు సంబంధించి పలు జాగ్రత్తలను సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శివ్వంపేట ట్రాన్స్‌కో ఏఈ సస్పెన్షన్

శివ్వంపేట, సెప్టెంబర్ 10: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక సెల్‌కు వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టి మెదక్ సర్కిల్ శివ్వంపేట్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ బి.దుర్గాప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ చీఫ్ ఇంజనీర్, రూరల్‌జోన్ పి. భిక్షపతి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఒక పనికి సంబంధించి ఎస్టిమేషన్ తయారు చేసి, వర్క్ ఆర్డర్ రిలీజ్ చేయడానికి దుర్గాప్రసాద్ లంచం డిమాండ్ చేస్తున్నారని సీఎండీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కాల్ సెంటర్‌కు బాధిత కాంట్రాక్టర్ ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. దీనిపై చేసిన క్షేత్రస్థాయి విచారణలో ఆరోపణలు రుజువు కావడంతో శివ్వంపేట ఏఈ దుర్గాప్రసాద్‌ను సస్పెండ్ చేశారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు

జిన్నారం, సెప్టెంబరు 10: బొల్లారం మున్సిపాలిటీలోని 6వ వార్డులో రూ.30 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను చైర్‌పర్సన్ రోజారాణి మంగళవారం ప్రారంభించారు. వెంట కౌన్సిలర్ సుజాత, మేనేజర్ నిర్మలారెడ్డి ఉన్నారు.

ఆసుపత్రుల్లో డీసీహెచ్‌వో ఆకస్మిక తనిఖీ

నారాయణఖేడ్/కల్హేర్, సెప్టెంబరు 10: నారాయణఖేడ్, కల్హేర్ ఏరియా వైద్యశాలలను మంగళవారం జిల్లా వైద్యశాలల కోఆర్డినేటర్(డీసీహెచ్‌వో) సంగారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్యశాలకు సంబంధించిన వివిధ రికార్డులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను, మందుల నిల్వలు పరిశీలించారు. ఇన్‌పేషెంట్లు, ఔట్‌పేషెంట్లు, స్త్రీ, పురుష వార్డులను పరిశీలించి వారికి అందుతున్నసేవలను తెలుసుకున్నారు. వైద్యశాలలో నెలవారిగా ప్రసవాల వివరాలను ఆయా వైద్యశాలల డాక్టర్లు రమేష్, అనిల్‌రెడ్డి ల ద్వారా తెలుసుకున్నారు. వైద్యశాలలో సరిపడినంత ల్యాబ్ సిబ్బంది, వైద్యులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలని ఖేడ్ వైద్యశాల సూపరింటెండెంట్ రమేష్ డీసీహెచ్‌వోను కోరారు.



కల్హేర్‌లోని కమ్యూనిటీ ఆసుపత్రిలో సిబ్బందితో మాట్లాడుతున్న డీసీహెచ్‌వో సంగారెడ్డి

వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



చేగుంట: వడియారం వసతి గృహంలో బాలికల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్

చేగుంట/రామాయంపేట, సెప్టెంబరు 10: ప్రభుత్వ వసతి గృహలలో మౌలిక సదుపాయాల కల్పన కోసం కృషి చేస్తానని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. చేగుంట మండలంలోని చేగుంట, వడియారం బాలుర, బాలికల వసతిగృహలను, రామాయంపేటలోని బాలికల గురుకులాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఆయా వసతి గహాల్లో కనీస వసతులను పరిశీలించారు. అదే విధంగా విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వడియారం బాలికల వసతి గృహంలో విద్యార్థుల సంఖ్యకు సరిపోయేవిధంగా మూత్రశాలలు లేవని, వెంటనే మూత్రశాలలు నిర్మాణం చేయాల్సి ఉందన్నారు. జిల్లా కలెక్టర్ కనీస సౌకర్యాలు కల్పన కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. రామాయంపేటలోని బాలికల గురుకులంలో పలువురిని ఎలుకలు కరిచాయి కదా.. ఇప్పుడు అలాంటి ఘటనలు పునరావృతం అయ్యాయా అని విద్యార్థినులను పరిశీలించగా అంతా బాగానే ఉందంటూ వారు సమాధానమివ్వడంతో ఆయన సంతృప్తి చెందారు. వెంట జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు జిల్లా షెడ్యూల్‌కులాల అభివృద్ధి ఆధికారి శశికళ, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, ఎస్సీ, ఎసీ కమిషన్ సభ్యులు, వార్డెన్‌లు స్వాతి, రమేష్ తహసీల్దార్లు నారాయణ, రజిని, ఎస్‌ఐ చైతన్య రెడ్డి, ఆర్‌ఐ నర్సింగ్ యాదవ్, కౌన్సిలర్ దేమె యాదగిరి తదితరులు ఉన్నారు.

స్వచ్ఛ వాతావరణం దేశ ఆర్థిక వ్యవస్థకు దన్ను



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ అర్బన్, సెప్టెంబరు10: స్వచ్ఛమైన నీరు, ఆరోగ్యకరమైన వాతావరణం దేశ ఆర్థిక వ్యవస్థకు దోహదపడతాయని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ సహకారంతో మహిళా అభివృద్ధి సొసైటీ ఆధ్వర్యంలో నీరు, పారిశుధ్యం, పరిశుభ్రతపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో నీరు పారిశుధ్యం, వ్యక్తిగత, శారీరక, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలను చైతన్యం చేయడంలో డీఆర్డీఏ, మెప్మా సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. అంతకుముందు సురక్షితమైన తాగునీరు, పారిశుధ్యం, ఆర్థిక వనరులు, అవరోధాలు, నీటి వసతులు, మరుగుదొడ్ల సమస్యలు, నిపుణుల సేవలు, చిన్న సరళమైన రుణాలు, సులభంగా తిరిగి చెల్లించేలా చేయడంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మహిళా అభివృద్ధి సొసైటీ నిర్వాహకులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, మెప్మా పీడీ ఇందిర, డిప్యూటీ డీఎంహెచ్‌వో నవీన్‌కుమార్ ఏపీడీ సరస్వతీ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు క్రిష్ణాపూర్ పాఠశాల బాలికలు

కల్హేర్, సెప్టెంబరు 10: మండలంలోని క్రిష్ణాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం సుధాకర్ మంగళవారం తెలిపారు. సోమవారం ఉమ్మడి మెదక్ జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో తూప్రాన్‌లో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి సబ్ జూనియర్ పోటీల్లో పాఠశాలకు చెందిన సోనా, వర్ష, శివాత్మిక, హారిక అనే విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ నెల 13 నుంచి 15 వరకు ఖమ్మం జిల్లా కల్లూర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు తరపున వీరు ఆడనున్నట్లు హెచ్‌ఎం సుధాకర్ తెలిపారు.

క్రీడాస్ఫూర్తితో పోటీల్లో రాణించాలి

కొండాపూర్, సెప్టెంబరు 10: క్రీడాపోటీల్లో గెలుపోటములు సహజమని క్రీడాస్ఫూర్తితో పోటీల్లో రాణించాలని ఎంపీడీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం గిర్మాపూర్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో ఎస్‌జీఎఫ్ అండర్ 14,17 ఆటల పోటీలను ఎంఈవో భీంసింగ్‌తో కలిసి ఎంపీడీవో ప్రారంభించారు. మండల స్థాయిలో జరుగే కబడ్డీ,వాలీబాల్,ఖోఖో ఆటలు పోటీలు జరుపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర్, వైస్ ప్రిన్స్‌పాల్ ఖైరత్‌ఆలీ, పీడీలు లాలు, గోకుల్‌కృష్ణ, రాజు, కిష్టయ్య, జయంతి, పూలమ్మ. సీఆర్పీ అనంద్, విద్యార్థులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఎపిటోరియా పరిశ్రమ ఎదుట కార్మికుల ధర్నా

హత్నూర, సెప్టెంబరు 10: మండల పరిధిలోని బోర్పట్ల గ్రామ శివారులోని ఎపిటోరియా యూనిట్ -1 పరిశ్రమ ఎదుట మంగళవారం కార్మికులు బైఠాయించి ఆందోళనకు దిగారు. ఉదయం 6గంటల నుంచి విధులను బహిష్కరించి, పరిశ్రమ ఎదుట బైఠాయించారు. టెక్నికల్, కాంట్రాక్టు కార్మికులు పరిశ్రమ యాజమాన్యం వైఖరికి నిరసనగా ఆందోళనకు దిగారు. ఉద్యోగాల కేటాయింపుల్లో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల వ్యక్తులను తీసుకువచ్చి ఉన్నతస్థాయి ఉద్యోగాలు కల్పిస్తున్నారని ఆరోపించారు. యాజమాన్యం దిగివచ్చి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు తమ ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. జిన్నారం సీఐ సుధీర్‌కుమార్, హత్నూర ఎస్‌ఐ సుభాష్‌లు పరిశ్రమ వద్దకు చేరుకొని కార్మికులకు పలు విధాలుగా సముదాయించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ రాత్రి అయినా కార్మికులు తమ ఆందోళనను కొనసాగించారు. కాగా కార్మికులు చేపట్టిన ఆందోళనకు బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నాగప్రభుగౌడ్ ఆందోళన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు.

తాపేశ్వరం లడ్డూ బహూకరణ

● అందజేసిన మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



తాపేశ్వరం లడ్డూ

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 10: పట్టణంలో వాడవాడలా గణనాథునికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి కోలిగడ్డ నేతాజీ యువజన సంఘం గణేష్ మండలివారికి తాపేశ్వరం లడ్డూను బహూకరించారు. బాలాపూర్‌లో కూడా తాపేశ్వరం లడ్డూను ఏర్పాటు చేస్తారని, అక్కడి నుంచే నేతాజీ యువజన సంఘానికి లడ్డూను తెప్పించినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈసారి కూడా మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని కోరగా లడ్డూను బహూకరించినట్లు చెప్పారు.

విద్యార్థినులకు చట్టాలపై అవగాహన ఉండాలి

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 10: విద్యార్థినులు కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ జిల్లా అధికారి నాగమణి అన్నారు. మండలంలోని సూరారం హైస్కూల్లో ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు పలు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ మోసాల వలలో పడకుండా జాగ్రత్త పడాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాయిరెడ్డి, చైల్డ్ వెల్ఫేర్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో సంగారెడ్డి జిల్లా ఫస్ట్ రావాలి

● జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి

జోగిపేట/నారాయణఖేడ్, సెప్టెంబరు10: అందోలు నియోజకవర్గం జిల్లాలోనే మొదటి స్థానంలో ఉండేలా పార్టీ సభ్యత్వ నమోదును చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. మంగళవారం ఆమె, జోగిపేటలో...జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.ప్రభాకర్ గౌడ్‌తో కలిసి అందోలు నియోజకవర్గ బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదేవిధంగా నారాయణఖేడ్ పట్టణంలోని సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో సభ్యత్వ నమోదుపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ... మోదీ పథకాలను వివరిస్తూ ప్రతీ ఇంటి నుంచీ సభ్యత్వం ఉండేలా సభ్యత్వాలు చేపట్టాలన్నారు. సభ్యత్వ నమోదును ఒక ఉద్యమంలా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్. ప్రభాకర్ గౌడ్, రాములు, బీజేపీ జిల్లా, ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

రైతులను విస్మరిస్తున్న పాలకులు: జహీరాబాద్ ఎమ్మెల్యే

న్యాల్‌కల్, సెప్టెంబరు 10: అధికారంలో కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరించిందని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చాల్కి, చీకుర్తీ,రాఘవపూర్ తదితర గ్రామాల్లో రైతుల పంటపొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలప్రభావంతో నియోజకవర్గంలో రైతుల పంటలు ఎక్కువమొత్తంలో దెబ్బతిన్నాయన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్,మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు డప్పూర్ రవీందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ, వ్యవసాయ కమిషన్ చైర్మన్లకు సన్మానం

నారాయణఖేడ్, సెప్టెంబరు 10: బీసీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన నిరంజన్, వ్యవసాయ కమిషన్ చైర్మన్‌గా నియామకమైన కోదండరెడ్డిలను మంగళవారం హైదరాబాద్‌లో స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఆయన సోదరుడు డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డిలు శాలువా, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. అదేవిధంగా టీపీసీసీ అధ్యక్షుడిగా నియామకమైన మహేష్‌కుమార్‌గౌడ్‌ను హైదరాబాద్‌లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి మంగళవారం కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువాతో, సన్మానించారు. అనంతరం పట్టణంలోని శివ పంచాయతీన అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే ఆయన సతీమణి అనుపమారెడ్డితో కలిసి పత్యేక పూజలు నిర్వహించారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి రెడ్‌క్రాస్ సొసైటీ సన్మానం

జహీరాబాద్, సెప్టెంబరు 10: ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఇటీవల అవార్డును అందుకున్న అల్గోల్ పాఠశాల ఉపాధ్యాయురాలు వినయపాటిల్‌కు రెడ్‌క్రాస్‌సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీసభ్యులు సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించి అవార్డును అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రెడ్‌క్రాస్‌సొసైటీవారు ఉత్తమఉపాధ్యాయులను సన్మానించిన నేపథ్యంలో జహీరాబాద్‌మండలం అల్గోల్ పాఠశాలలో పనిచేస్తున్న తనను అహ్వానించి సన్మానించినట్లు ఉపాధ్యాయురాలు వియయపాటిల్ తెలిపారు.

నైపుణ్య కళాశాలలను ఏర్పాటు చేయాలి

జహీరాబాద్, సెప్టెంబరు 10: న్యాల్‌కల్ మండలంలోని డప్పూర్,మల్గి, వడ్డీ తదితరగ్రామాల్లో ఏర్పాటుచేసే ఫార్మసిటీ స్థానంలో యువత అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని స్కిల్‌డెవలప్‌మెంట్ కళాశాలలను ఏర్పాటు చేయాలని ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నరోత్తం పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ జహీరాబాద్‌ప్రాంతంలో ఇప్పటివరకు ఏర్పాటు చేసిన పరిశ్రమల్లో ఆయా కర్మాగారాలు స్థానికులకు అన్యాయం చేస్తే ఊరుకోబోమని, ఆందోళనలను తీవ్రతరం చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు శంకర్, రాములు, నర్సింలు, జైపాల్ పాల్గొన్నారు.

విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించాలి: ఆవుల రాజిరెడ్డి

మాసాయిపేట, సెప్టెంబర్ 10: విద్యార్థులు క్రీడా నైపుణ్యాలను అలవర్చుకొని రాష్ట్రస్థాయిలో రాణించాలని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ మైదానంలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు ఎంపికకు విద్యార్థులను ఎంపిక చేశారు ఈ సందర్భంగా ఎంపిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాట్లాడారు.

సమస్య పరిష్కారం కాకపోతే ఆత్మహత్యలు సరికాదు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 10: సమస్య పరిష్కారం కాకపోతే ఆత్మహత్యలు సమాధానం కాదని జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.అనిల్‌కుమార్ పేర్కొన్నారు. ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జీజీహెచ్ సైకియాట్రిక్ విభాగం ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఆస్పత్రి నుంచి మెడికల్ కాలేజీ వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం సూపరింటెండెంట్ డా.అనిల్‌కుమార్ మాట్లాడారు. ప్రతి సమస్యకు ఒక పరిష్కారమనేది ఉంటుందని, తొందరపడి బలవన్మరణాలకు పాల్పడవద్దని కోరారు. ఎవరైనా మనోవేదనకు గురైతే నేరుగా మానసిక వైద్య నిపుణులను సంప్రదించాలని సూచించారు. తోటి మిత్రులు, కుటుంబీకులతో సమస్యలను చర్చించి పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సైకియాట్రిక్ విభాగం హెచ్‌వోడీ డా.శ్రీలక్ష్మి, ఆర్ఎంవోలు డా.వీరాంజనేయులు, డా.రవికుమార్, డా.విజయ్, డా.సింధు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ అనీల్, డాక్టర్లు

● రామాయంపేట: రామాయంపేట పట్టణంలో మంగళవారం నిర్వహించిన ఆత్మహత్యల నివారణ దినోత్సవ ర్యాలీలో ఆవాసం విద్యార్థులు సుమారు కిలోమీటర్ వరకు నినాదాలు చేస్తూ పాల్గొన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్లో కరపత్రాలను ఎస్‌ఐ ఆవిష్కరించారు.

పీసీసీ నూతన అధ్యక్షుడికి అభినందనల వెల్లువ

పటాన్‌చెరు/గుమ్మడిదల/ జిన్నారం/రామచంద్రాపురం, సెప్టెంబరు 10: పీసీసీ అధ్యక్షుడుగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్‌కు పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మంగళవారం అభినందనలు తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటశ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో నియోజకవర్గంలోని గుమ్మడిదల, జిన్నారం, రామచంద్రాపురం మండలాల కాంగ్రెస్ నాయకులతో కలిసి పీసీసీ అధ్యక్షుడిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జహీరాబాద్ ఎంపీ కాంటెస్టెడ్ అభ్యర్థి గాలిఅనిల్‌కుమార్ పీసీసీ అధ్యక్షుడిని కలిసి పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించారు.



పీసీసీ అధ్యక్షుడికి పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులతో కలిసి అభినందనలు తెలుపుతున్న కాటా శ్రీనివాస్‌గౌడ్

సాయుధ పోరాటాన్ని రగిల్చిన వీరనారి ఐలమ్మ



సంగారెడ్డిలో ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



పటాన్‌చెరు: ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి తదితరులు



తూప్రాన్‌లో చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పలు సంఘాల నాయకులు



నర్సాపూర్‌లో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

న్యూస్ నెటవర్క్, సెప్టెంబరు 10:

తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 39వ వర్ధంతిని సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయా మండలాల్లో పలు సంఘాల ఆధ్వర్యంలో ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటాన్ని రగిల్చిన వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. నిజాం పాలనలో వెట్టిచాకిరితో మగ్గిపోయిన అణగారిన వర్గాల బతుకులను బాగు చేసేందుకు సాయుధ పోరాటం చేశారన్నారు. సంగారెడ్డిలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, కల్లుగీత కార్మిక సంఘం, గౌడసంఘం, ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి తదితర సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ప్రాంతానికి ఐలమ్మ చేసిన సేవలను కొనియాడారు. నారాయణఖేడ్‌లో రజక సంఘం, కాంగ్రెస్, బీజేపీల ఆధ్వర్యంలో వేర్వేరుగా ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పటాన్‌చెరులోని పటాన్‌చెరు సాకిచెరువు వద్ద ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి నేతృత్వంలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. అదేవిధంగా కంగ్టి, కొండాపూర్, వట్‌పల్లి, రామచంద్రాపురం మండలాల్లో ఐలమ్మ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వెల్దుర్తి, శివ్వంపేట మండలంలోని గోమారం గ్రామంలో, రేగోడు, నర్సాపూర్ మండలాల్లో ఐలమ్మ విగ్రహాలు, చిత్రపటాలకు పలు సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.